క్లుప్తంగా

రజకుడికి ఎమ్మెల్యే ఆర్కే చేయూత

మంగళగిరి: నగరంలోని కొత్తపేటకు చెందిన రజకుడికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చేయూతనిచ్చారు. ఆవులమంద ఏడుకొండలు ఇస్త్రీ చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇస్త్రీ బండి పాడవడంతో ఇబ్బంది పడుతున్నాడు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్కే తన సొంత నిధులతో బండి తయారు చేయించి అందించాడు. శుక్రవారం పార్టీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, బొమ్ము శివరామిరెడ్డి, సంకె సునీత, నాసిర్‌లు ఏడుకొండలుకు బండి అందజేశారు.

పెనుమాక శ్మశానవాటికలో చోరీ

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని పెనుమాక హిందూ శ్మశానవాటికలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం తెల్లవారుజామున ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు హిందూ శ్మశానవాటికలో ప్రవేశించి మృతదేహాలను దహనం చేసేందుకు ఏర్పాటుచేసిన బీడు ప్లేట్లను విప్పదీసి చోరీ చేశారు. హిందూ శ్మశానవాటికలో మృతదేహాలను దహనం చేసేందుకు రెండుచోట్ల వీటిని ఏర్పాటు చేశారు. వాటిలో ఉన్న రెండు బీడు ప్లేట్లు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఒక్కొక్క ప్లేటు రూ.50 వేల విలువ ఉంటుందని స్థానికులు తెలియజేశారు. ఈ సంఘటనపై తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ప్రమాదకరంగా గుంత



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కొండమెట్లబజారు నుంచి గాంధీ బొమ్మ వైపు వెళ్లే దారిలో కాలువపై ఏర్పాటు చేసిన సిమెంటు పైపు పగిలిపోయి ప్రమాదకరంగా మారింది. పగిలిన పైపుపై పెద్ద గుంత ఏర్పడటంతో దానిపై స్థానికులు తాత్కాలికంగా నడిచేందుకు వీలుగా బండరాయిని పెట్టారు. నిత్యం ఈదారి మీదుగా పలు వాహనాలు వెళుతుండటంతో బండరాయి పూర్తిగా పగిలిపోయింది. రాత్రి సమయాల్లో వాహనాలు బండకు తగిలి కింద పడి గాయాలపాలవుతుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువపై పైపును ఏర్పాటుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల గ్రామంలోని సుగాలీ కాలనీ, ఎస్సీ కాలనీ, చెన్నకేశవ నగర్ వాసులు పడుతున్న ఇబ్బందులకు తెరపడింది. శుక్రవారం ఈ మూడు ప్రాంతాలకు అనువుగా బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ప్రజలు పడుతున్న కష్టాలను గమనించి, చొరవ తీసుకుని కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్ వారితో మాట్లాడి ఫుట్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. సుమారు రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఈ బ్రిడ్జి కారణంగా సుగాలీ కాలనీ, ఎస్సీ కాలనీ, చెన్నకేశవనగర్ ప్రాంత ప్రజలకు సుమారు కిలోమీటర్ మేర చుట్టూ తిరగాల్సిన పరిస్థితి తప్పుతుంది. బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభమైనందుకు దుగ్గిరాల వాసులు ఎమ్మెల్యే ఆర్కేకు ధన్యవాదాలు తెలిపారు.

వైభవంగా వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు

పాత గుంటూరు: కొత్తపేటలోని శ్రీ జగన్నాథ స్వామి దేవస్థానంలో శ్రీ రుక్మిణీ సత్య భామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామిని తులసి మాలతో అలంకరించారు. ఉదయం వసంతోత్సవం, చక్రస్నానం, పూర్ణాహుతి నిర్వహించారు. రాత్రి ధ్వజావరోహణ, బలిహరణ నిర్వహించారు. కార్యక్రమాల్ని ఆలయ చైర్మన్ పిచ్చుల జయప్రకాష్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్, ఈవో డి. శ్రీనివాసరావు, అర్చకులు అయోధ్య అయ్యప్ప పర్యవేక్షించారు. ధర్మకర్తల మండలి సభ్యులు విశాలాక్షి, వెంకట జ్యోతి, నరేష్ కుమార్, రామకోటేశ్వరరావు, వెంకటరత్నం, శ్రీనివాసులు, అనిత, శివకుమారి పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

పాత గుంటూరు: లాలాపేటలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం నిత్య హోమం, బలిహరణ, లక్ష మల్లెల పూజ నిర్వహించారు. రాత్రికి సుదర్శన వెంకటేశ్వర అష్టాక్షరి మంత్ర హోమం, స్వామికి హంస వాహనంపై గ్రామోత్సవం వైభవంగా జరిగింది. కార్యక్రమాల్ని దేవస్థానం చైర్మన్ పిచ్చుల జయప్రకాష్‌రెడ్డి, దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్, ఈవో డి. శ్రీనివాసరావు, అర్చకులు ప్రసాద్, మురళీ చంద్ర కుమార్, శ్రీనివాసాచార్యులు పర్యవేక్షించారు. ధరకర్తల మండలి సభ్యులు విశాలాక్షి, వెంకట జ్యోతి, నరేష్ కుమార్, రామకోటేశ్వరరావు, వెంకటరత్నం, శ్రీనివాసులు, అనిత, శివకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

నెరవేరిన రైతుల కోరిక

- డొంకలో బీటీరోడ్ నిర్మాణ పనులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న ఇప్పటం రైతులు



ఇప్పటం ఆంజనేయస్వామి విగ్రహం వద్ద, పంట కాలువ ఒడ్డున జరుగుతున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఇప్పటం రైతుల చిరకాల కోరిక ఎట్టకేలకు నెరవేరింది. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) చొరవతో ఇప్పటం పంటకాలువ ఒడ్డున ఉన్న ఆంజనేయస్వామి విగ్రహం వద్ద నుంచి బకింగ్‌హామ్ కెనాల్ వరకు, పెదవడ్లపూడి ఇప్పటం రోడ్ నుంచి రైల్వే గేట్ వరకు, గంగరాయి చెట్టు దగ్గర నుంచి జగనన్న కాలనీ వరకు 1.3 కిమీ బీటీ రోడ్డు నిర్మాణాన్ని నగర పాలక సంస్థ ప్రత్యేక నిధులు రూ.కోటితో చేపట్టారు. ఇప్పటం, పెదవడ్లపూడికి చెందిన రైతులకు ఈ రహదారి ఎంతగానో ఉపయోగపడుతుంది. పెదవడ్లపూడి ఎత్తిపోతల హై లెవల్ కెనాల్ నుంచి బకింగ్ హామ్ కెనాల్ ఒడ్డున గతంలో గ్రావెల్ రోడ్ నిర్మాణం చేశారు. ఆ రోడ్డుకు అనుసంధానంగా బకింగ్‌హామ్ కెనాల్ నుంచి పెదవడ్లపూడి ఇప్పటం వరకు బీటీ రోడ్ నిర్మాణం చేస్తుండడంతో తమ పొలాల్లో పండించిన పంటను విజయవాడ మార్కెట్‌కు తరలించడానికి ఎంతో ఉపయోగపడుతుందని, ఈ ప్రాంతంలో రైతులు గులాబీ, చేమంతి, మల్లె, కాగడ మల్లె, కనకాంబరాలతోపాటు కూరగాయలు పండిస్తారని గతంలో రహదారి సౌకర్యం లేక చాలా ఇబ్బందులు పడేవారమని, టీడీపీ ప్రభుత్వ హయాంలో రోడ్లు నిర్మించాలని దరఖాస్తు చేసుకోగా ఇల్లు పడవేసిన మట్టిని తోలడంతో చాలా ఇబ్బంది పడ్డామని తెలిపారు. ఎమ్మెల్యే ఆర్కే రెండో సారి ఎమ్మెల్యే అయిన తరువాత మొదట గ్రావెల్ రోడ్ నిర్మించి, ప్రస్తుతం బీటీ రోడ్ నిర్మిస్తున్నారని, ఈ రోడ్డు నిర్మాణం వల్ల సుమారు 500 హెక్టార్ల రైతులకు ఎంతో ఉపయోగం ఉంటుందని, ఆత్మకూరులో నిర్మించిన జగనన్న కాలనీకి రోడ్డు ఏర్పడుతుంది.

మోకాలి లోతు బురదలో తిరిగేవాళ్లం



బకింగ్‌హామ్ కెనాల్ ఒడ్డున ఉన్న పంట పొలాలకు వెళ్లాలంటే మోకాలి లోతు బురదలో వెళ్లేవాళ్లం. అక్కడి నుంచి గడ్డిమోపు తేవాలన్నా, ఇతర పంట ఉత్పత్తులు తీసుకురావాలన్నా కూలీ ఖర్చులు ఎక్కువ అయ్యేవి. ఎమ్మెల్యే మొదట గ్రావెల్ రోడ్ నిర్మించారు. ఇప్పుడు బీటీ రోడ్డు నిర్మాణం చేస్తున్నారు. రైతుల పంట పొలాల్లో కూడా బీటీ రోడ్డు నిర్మించడం పట్ల ఎమ్మెల్యే ఆర్కేకు అన్నదాతల పట్ల ఎంత గౌరవం ఉందో అర్థం చేసుకోవచ్చు.

–లచ్చి గురుప్రసాద్‌గౌడ్, రైతు, ఇప్పటం

ఇలాంటి రోడ్డు ఎక్కడా చూడలేదు



డొంకల్లో ఇలాంటి రోడ్లు నేను ఎప్పుడూ చూడలేదు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి రెండవసారి గెలిచిన అనంతరం ఆయన మొట్టమొదటగా రైతులు పంటపొలాలకు వెళ్లే రహదారుల్లో గ్రావెల్ పోయించారు. మొట్టమొదట డొంకరోడ్లు నిర్మించింది మా ఇప్పటంలోనే. తారురోడ్డు కూడా నిర్మిస్తోంది మా దగ్గరే. రైతులకు మంచి రోజులు వచ్చాయి. భవిష్యత్తులో రైతులకు ఇలాంటి రోడ్లు వస్తాయని నేను బలంగా నమ్ముతున్నాను.

–మున్నంగి కోటిరెడ్డి, రైతు, ఇప్పటం

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- నాణ్యతలో రాజీలేకుండా చూడాలి
- నగరంలో పలు అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ఆర్కే



యర్రబాలెం బసవతారకనగర్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: నాణ్యతలో రాజీపడకుండా అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. నగరంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ఆర్కే శుక్రవారం నగరపాలక సంస్థ అధికారులతో కలిసి పరిశీలించారు. తెల్లవారుజామున 5 గంటలకు నగరంలోని ఆత్మకూరు తాగునీటి పథకం ఆవరణలో నిర్మాణంలో ఉన్న స్కేటింగ్ రింగ్ స్లాబ్ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. వేసవి నేపథ్యంలో పనులు త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు.

నూతక్కి..మెల్లెంపూడి రోడ్డు పరిశీలన

నగర పరిధిలోని నూతక్కి–మెల్లెంపూడిల మధ్య రెండున్నర కోట్లతో చేపట్టిన రెండు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. రోడ్డు నిర్మాణం నాణ్యతలో రాజీపడకుండా తుదిదశకు చేరుకున్న నేపథ్యంలో వెంటనే పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. బీటీ రోడ్డు పూర్తయిన వెంటనే విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేసి దీపాలు అమర్చాలని సూచించారు. అనంతరం యర్రబాలెం బసవతారక నగర్‌లో రూ.60 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం, గ్రావెల్ రోడ్లు, నవులూరు, చినకాకాని ఎన్ఆర్ఐ జంక్షన్‌లో జరుగుతున్న గ్రావెల్ రోడ్ల నిర్మాణాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.

15 నాటికి చేనేత మగ్గం షెడ్లు పూర్తిచేయాలి

నగరంలోని రాజీవ్ గృహకల్ప వద్ద నిర్మాణంలో ఉన్న చేనేత మగ్గం షెడ్ల నిర్మాణాలు పూర్తి చేసి ఈనెల 15వ తేదీ నాటికి లబ్ధిదారులకు అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. షెడ్ల నిర్మాణాలు తుదిదశకు చేరుకున్న నేపథ్యంలో పనులు వేగవంతం చేసి సత్వరమే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదే ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న రజక కమ్యూనిటీ హాల్, విద్యుత్ సబ్‌స్టేషన్, పద్మశాలీయ కమ్యూనిటీ హాల్ నిర్మాణాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్, విద్యుత్ శాఖ ఎస్ఈ విజయ్‌కుమార్, పార్టీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

8న వీరాంజనేయస్వామి వార్షికోత్సవం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని వీరాంజనేయస్వామి జీవధ్వజ ప్రతిష్ఠ ఆరో వార్షికోత్సవం ఈనెల 8న నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు ఎం.కె.ఆర్ తారకం, సూర్య నారాయణ, వెంకటరమణారావులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం స్వామివారికి విశేష అర్చన, స్నపన, నాగవల్లీదళాలతో అష్టోత్తర, సహస్ర నామ పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం మండపంలో విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షాసూత్రధారణ, ఉత్సవమూర్తులకు స్నపన, తిరుమంజన కార్యక్రమాలను అర్చకులు నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణ నిర్వహించి హనుమద్వజంకు హోమ కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. సాయంత్రం పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి గ్రామోత్సవం చేయనున్నట్లు తెలిపారు.

అక్రమ మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు, కింద కూర్చుని ఉన్న నిందితుడు

తాడికొండ: తుళ్లూరులో ఇతర రాష్ట్రాల మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఎస్ఈబీ సీఐ మారయ్య బాబు ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించారు. తుళ్లూరుకు చెందిన కామినేని సాంబశివరావు నుంచి రూ.48,600 విలువ చేసే మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలపై అనునిత్యం నిఘా ఉంటుందని, ఎవరైనా చట్టవ్యతిరేక పనులు చేస్తుంటే తమకు సమాచారం ఇస్తే వారి సమాచారం గోప్యంగా ఉంచి నిందితులను అదుపులోకి తీసుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఈబీ సీఐ మారయ్యబాబు తెలిపారు. దాడిలో ఎస్ఐ మల్లికార్జున్, కోటిరెడ్డి, సిబ్బంది రమేష్, హనుమంతు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి


- వైఎస్సార్ సీపీ నాయకులు కత్తెర సురేష్‌కుమార్
- మందడంలో వలంటీర్లకు సన్మానం



వలంటీర్లతో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్

మందడం(తాడికొండ): ప్రభుత్వ సేవలను ప్రజలకు చేర్చడంలో వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. తుళ్లూరు మండలం మందడం గ్రామ సచివాలయంలో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ఏపీలో జరుగుతున్న సేవలను చూసి దేశంలోనే అందరూ ఆదర్శంగా తీసుకునే పరిస్థితి వచ్చిందంటే జగనన్న ముందుచూపు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. నిరుద్యోగ యువతకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలవడంతోపాటు ప్రజాసేవ చేసే అవకాశం కల్పించిన జగనన్నకు వలంటీర్లు కృతజ్ఞతలు తెలుపుతున్నారన్నారు. ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు ప్రభుత్వం ఏటా సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులను అందిస్తూ ప్రోత్సహిస్తుండటం వారిలోని ప్రతిభను వెలికితీసి ప్రజలకు ఉపయోగపడేలా చేసేందుకే అన్నారు. ప్రభుత్వ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రజలకు ఉత్తమ సేవలందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలో ఎన్నికల వేళ సమీపిస్తుండటంతో ఆల్‌ఫ్రీ హామీల బాబు ప్రజలను మరోసారి మోసం చేసేందుకు అబద్ధపు హామీలతో బయల్దేరాడని, ఆచరణకు సాధ్యం కాని హామీలతో మేనిఫెస్టో విడుదల చేసిన చంద్రబాబును ప్రజలు ఎప్పటికీ నమ్మరని గుర్తుంచుకుంటే మంచిదన్నారు. అటు సంక్షేమం, ఇటు అభివృద్ధి రెండు కళ్లు అన్ని వర్గాలకు మంచి చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి మరో 50 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా విజయం జగనన్నదే కనుక బాబు రాజకీయ సన్యాసం చేసి పలాయానం చిత్తగించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీ 20, నూతన విద్యావిధానంపై అవగాహన



చిత్రలేఖనంలో పాల్గొన్న విద్యార్థులు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని మంచికలపూడి ఎంపీయూపీ పాఠశాలలో జీ 20, నూతన విద్యావిధానంపై తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.డి.కరీముల్లా మాట్లాడుతూ జీ 20, నూతన విద్యావిధానంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించామని అన్నారు. 6,7 తరగతుల విద్యార్థులకు స్టోరీ టెల్లింగ్, టెస్ట్‌బుక్ రీడింగ్, సైన్స్, సోషల్, జనరల్ నాలెడ్జి అంశాలపై క్విజ్, చిత్రలేఖనం తదితర అంశాలపై పోటీలు నిర్వహించామని వివరించారు. కొన్ని పదాల ఆధారంగా విద్యార్థులు స్టోరీని సొంత వాక్యాలలో తయారుచేశారని అన్నారు. అనంతరం మంచికలపూడి గ్రామంలో ర్యాలీ నిర్వహించామని, విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించామని వివరించారు. విద్యార్థులకు ఆటల పోటీలు, క్విజ్‌లలో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశామని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మికులతో పని చేయిస్తున్న యజమానిపై కేసు నమోదు

పట్నంబజారు: దుకాణంలో బాల కార్మికులతో పని చేయిస్తున్న యజమానిపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాలు... లాలాపేట పరిధిలోని వెంకటరమణ పాలిమర్స్‌లో ఇద్దరు బాల కార్మికులు పనిచేస్తుండటం గుర్తించి చైల్డ్ వెల్ఫేర్ అధికారులు దాడిచేసి పట్టుకున్నారు. యజమాని కోదాటి ఉదయ్‌కుమార్‌పై చైల్డ్ వెల్ఫేర్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శిక్షణకు వెళ్లిన కేఎల్‌యూ ఎన్‌సీసీ క్యాడెట్లు



తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ యూనివర్సిటీకి చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు గుంటూరు జిల్లాస్థాయి శిక్షణ శిబిరానికి వెళ్లినట్లు ఆంధ్రా 22వ బెటాలియన్ లెఫ్టినెంట్ వి.మౌనిక తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గుంటూరు జిల్లా గోళ్లమూడిలోని నాట్కో కేంద్రీయ విద్యాలయంలో ఏర్పాటుచేసిన శిక్షణ శిబిరం జూన్ 10వ తేదీ వరకు కొనసాగుతుందని, ఈ శిబిరంలో క్యాడెట్లకు ఫైరింగ్, మ్యాప్ రీడింగ్, డ్రిల్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తారని వివరించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలకు అత్యవసర సహాయం అందించే విషయంలో ప్రత్యేక శిక్షణ ఉంటుందని, రిపబ్లిక్ డే పరేడ్‌పై కూడా శిక్షణ ఇస్తారని అన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థ సారథి వర్మ, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, డీన్ సలహాదారులు డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్, డాక్టర్ హబీబుల్లా ఖాన్, హాబీ క్లబ్ ఇన్‌చార్జి ఆచార్య ఆర్.సుభాకరరాజు, సమన్వయకర్త జీవీకేపీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు కోకోకోలా కంపెనీ వద్ద రోడ్డు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు గత నెల 30వ తేదీన కోకోకోలా కంపెనీ గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి వయస్సు సుమారు 35 సంవత్సరాలు ఉంటుందని, నలుపు రంగు, 5.6 అడుగులు ఎత్తు ఉంటాడని ఆచూకీ తెలిసిన వారు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో తెలపాలని కోరారు.

చిత్తశుద్ధితో దైవ మార్గాన్ని అనుసరించాలి

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)

మంగళగిరి: రానున్న క్రిస్మస్ పండుగ నాటికి మంగళగిరి బాప్తీస్మం ఘాట్‌ను పూర్తి చేయనున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తెలిపారు. నగరంలోని ఆత్మకూరు తాగునీటి పథకం వద్ద బాప్తీస్మం ఘాట్ నిర్మాణం కోసం నగర పాలక సంస్థ కేటాయించిన స్థలంలో ఎమ్మెల్యే ఆర్కే శుక్రవారం శంకుస్థాపన చేశారు. బాప్తీస్మం ఘాట్ నిర్మాణం కోసం ఎమ్మెల్యే ఒక నెల జీతం రూ.లక్షా 80వేల ఆర్థిక సహాయంగా ప్రకటించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ బాప్తీస్మం అనేది మత మార్పిడి కాదని, మనస్సు మార్పిడి అన్నారు. క్రైస్తవ సోదరులు ప్రేమ, శాంతి, కరుణ, దయ కలిగిన క్రైస్తవాన్ని చెప్పడంతోపాటు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో దైవ మార్గాన్ని అనుసరించాలని కోరారు. నగర క్రైస్తవుల కోసం ఈ బాప్తీస్మం ఘాట్ నిర్మాణానికి అడుగులు పడడం సంతోషకరమన్నారు. గతంలో కృష్ణానది ప్రాంతంలో బాప్తీస్మం కోసం క్రైస్తవ సోదరులు పడిన ఇబ్బందులు తొలగిపోనున్నాయన్నారు. కార్యక్రమంలో మంగళగిరి పాస్టర్స్ ఫెల్లోషిప్ ప్రతినిధులు తిమోతి, కెజె రవికుమార్, వి.శాంసన్, ఏబీఎస్ మణి, కె కరుణాకర్, ఎం విజయరాజు, జాన్‌లూయిస్, కె రూఫస్, కె జోజిబాబులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాల దుర్వినియోగంపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ శేఖర్‌బాబు

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని పెనుమాక, చిగురు బాలల గ్రామంలో చైల్డ్ సేఫ్టీ బాలల పార్లమెంట్ విద్యార్థులకు మత్తుపదార్థాల దుర్వినియోగంపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వలన విద్యార్థులు జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని, సరదాగా అలవాటు చేసుకుని చివరకు బానిసలుగా మారుతున్నారని వివరించారు. మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల చిన్న వయస్సు నుండే నేరప్రవృత్తికి అలవాటు పడడం, జీవితాన్ని మధ్యలోనే తెంచేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్స్, ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతాయని, మత్తు పదార్థాలతో జీవితాన్ని దుర్భరం చేసుకోవద్దని సూచించారు. మత్తు పదార్థాలకు బానిసైన వారిని డీ ఎడిక్షన్ చికిత్స ద్వారా బయటకు తీసుకురావచ్చని, నవజీవన్ బాలభవన్ ఏర్పాటు చేసిన బోస్కో డీ ఎడిక్షన్ సెంటర్, నూజివీడులోని పోలసనపల్లి గ్రామంలో ఏర్పాటు చేశామని, మానసిక సమస్యలకు విజయవాడలో నీతోడు మానసిక వికాస కేంద్రాన్ని ఏర్పాటు చేశామని వివరాలకు 9490492020ను సంప్రదించవచ్చని కోరారు. కార్యక్రమంలో నవజీవన్ బాలభవన్ ప్రోగ్రామ్ మేనేజర్ ఎం.అల్ఫోన్స్‌రాజు, క్లస్టర్ కో ఆర్డినేటర్ కె.శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు దశాబ్దాల సమస్యకు పరిష్కారం

- వలియ దాసరి కుటుంబాలకు కులధ్రువీకరణ పత్రాలు
- ఎమ్మెల్యే ఆర్కే చొరవ ఫలితం



కులధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: నాలుగు దశాబ్దాలుగా కుల ధ్రువీకరణ పత్రాలు లేక ప్రభుత్వ సంక్షేమ పథకాలను నోచుకోని వలియ దాసరి కుటుంబాల సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరయ్యాయి. నగరంలోని మార్కేండేయ కాలనీలో 25 వలియ దాసరి కుటుంబాలున్నాయి. వారికి కల ధ్రువీకరణ పత్రాలు మంజూరు కాకపోవడంతో ప్రభుత్వ పథకాలు పొందలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వలియ దాసరి ఎస్సీ కుటుంబాలు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో చర్చించి వారికి కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరయ్యేలా చూడాలని అధికారులను కోరారు. వలియ దాసరి అనే కుల ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడంతో ఎమ్మెల్యే ఆర్కే ఉన్నతాధికారులతో చర్చించి వలియ దాసరి ఎస్సీ అని నమోదు చేసి కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయించారు. మంజూరైన కుల ధ్రువీకరణ పత్రాలను శుక్రవారం రాజీవ్ గృహకల్ప వద్ద లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఆర్కే అందజేయగా కుల ధ్రువీకరణ పత్రాలు అందుకున్న వారు ఎమ్మెల్యే ఆర్కేకు ధన్యవాదాలు తెలిపారు.

వరుస చోరీలతో రైతుల బెంబేలు

ఇప్పటంలో రూ.2 లక్షల విలువ చేసే విద్యుత్ మోటర్ల చోరీ



ఇప్పటంలో చోరీకి గురైన మోటర్లు ఉంచే సిమెంట్ దిమ్మెలు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుసగా విద్యుత్ మోటర్లు చోరీకి గురికావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

తాజాగా శుక్రవారం తెల్లవారుజామున ఇప్పటంలో పంటపొలాల్లో శ్మశానం వెనుక 5 విద్యుత్ మోటర్లు చోరీకి గురయ్యాయి. దీంతోపాటు హిందూ శ్మశానవాటిక పక్కన ఇప్పటం ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ సిబ్బంది ఏర్పాటు చేసిన విద్యుత్‌మోటారు సైతం చోరీకి గురైంది. ఇప్పటంలో దొంగిలించిన విద్యుత్ మోటర్ల విలువ రూ.40 వేల ఉంటుందని, ఐదు మోటర్ల విలువ సుమారు రూ.2 లక్షల వరకు ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా 15 రోజుల వ్యవధిలో తాడేపల్లి పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లోను, కుంచనపల్లి, ప్రాతూరు, పెనుమాక, ఉండవల్లి ప్రాంతాల్లో సుమారు 20 మోటర్ల వరకు చోరీకి గురయ్యాయి. ఈ సంఘటనపై రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.